# చాపకింద నీరు

**సన్నని తుంపర మొదలయింది. నిన్నటిదాకా వర్షం పడితే బాగుణ్ణనుకుంది సుజాత. కాని యివాళ చినుకులు చూడగానే గతుక్కుమంది. ఈ చినుకులు పెద్దవై వర్షం జోరుగా పడిపోతే తను అనుకున్నది మరి అవదు. అదీ తన భయం.**

ఆమె భయపడినంతా అయింది.

నాలుగువైపుల నించి ఎవరో తరుముకు వస్తున్నట్టు మబ్బులు ఆకాశాన్ని కమ్మి వేసేయి. ఈదురుగాలులు వీచడం మొదలెట్టి, సన్నని జల్లు ప్రారంభమై, అలా అలా వర్షం పెద్దదయింది. గాలికి చెట్లు వూగుతున్నాయి. తలుపులు ధనేల్‌మని కొట్టుకుంటున్నాయి. కిటికీ రెక్కలు హార్మోనియమ్ వాయిస్తున్నాయి. కర్టెన్లు సుతారంగా వూగిసలాడు తున్నాయి. చలి, వణుకు, చలి వేస్తుంటే, బయట వర్షంపడ్తూంటే ఏ పనీ చెయ్యబుద్ధి కాదు. మగాళ్ళకయితే పకోడీలు తింటూ, పేకాట ఆడుకోవాలని పిస్తుందేమో! తనకి మాత్రం ఏ నవలో చదువుకోవాలని ఉంటుంది. కాని, ఇప్పుడు ఆ వర్షం అంతా తన సరదామీదే పడి తన సరదాని పూర్తిగా తడిపేసినట్టు అనిపించింది ఆమెకి. ఉసూరు మంది ప్రాణం. నవలమీదకి దృష్టిపోలేదు. అతను త్వరగా వచ్చేస్తే బాగుణ్ణు. అతనొచ్చేలోగా వర్షం తగ్గితే బాగుణ్ణు. రోడ్లన్నీ బురద లేకుండావుంటే బాగుణ్ణు. అతని మూడ్ బాగుండి "పద సుజీ! సినిమాకెళ్దాం అని పొద్దున్న చెప్పేవు. మర్చి పోయేవా?" అని తనంత తానే అడిగితే బాగుణ్ణు" అనుకుంది.

వర్షం పూర్తిగా వెలిసేసరికి అయిదయింది. అతను రావడానికింకా అరగంట టైముంది. వర్షం వెలిసిపోయింది కదా, ఎందుకు రారు సినిమాకి! తప్పకుండా వస్తారు. తనువంటకూడా పూర్తిచేసేసింది. ఇహ మొహంకూడా కడుక్కుని, చీరమార్చుకోవడమే బాకీ. మిగిలిన పన్లన్నీ కూడా హుషారుగా పూర్తిచేసింది.

భాస్కరం వచ్చేడు.

స్కూటరు ఆఫీసుదగ్గరే వదిలేసి రిక్షాలో వచ్చేడు. వస్తూనే బట్టలిప్పుకుంటూ అన్నాడు. "అబ్బబ్బ, ఏం వర్షం, ఏం వర్షం! దంచేసింది! ఈ వర్షానికి మన వంటిల్లు కారిపోయి వుండాలే పూర్తిగా?"

'లేదు' అని తల అడ్డంగా వూపింది సుజాత . ఆమెకళ్ళముందు సినిమా కదుల్తున్నది. భాస్కరం తనంత తానే సినిమా విషయం ఎత్తుతాడేమోనని ఎదురుచూస్తున్నది.

పొగలు కక్కుతున్న స్ట్రాంగ్ కాఫీ తెచ్చి భర్త చేతికందించింది.

కాఫీ త్రాగేసి కప్పుని పక్కనపెట్టి ఇలస్ట్రేటెడ్ వీక్లీ పేజీలు తిరగెయ్యడం మొదలు పెట్టేడు భాస్కరం.

ఖాళీ కప్పుని లోపలపెట్టి వచ్చి తనుకూడా అతని దగ్గర కూర్చుంది సుజాత.

"కాఫీ బ్రహ్మాండంగా వుంది" అని అంటారని వూహిస్తూ అతనేమీ అనకపోతే తనే...

"కాఫీ బాగుందా? పంచదార సరిపోయిందా?" అని అడిగింది.

"కాఫీకి బాగేమిటి! రోజూ తాగుతున్నదేగా!"

సుజాత మనసు చివుక్కుమంది.

"ఇవాళ స్పెషల్ కాఫీ. సినిమాకి వెళ్ళబోతున్నామనే వుత్సాహంతో బ్రహ్మాండంగా తయారు చేసిన కాఫీని అలా అనేస్తారేమిటి?" అనుకుంది మనసులో

"ఊఁ, మరేమిటి విశేషాలు? ఇవాళేమిటి చాలా హుషారుగా కనిపిస్తున్నావు?"

"ఎందుకో చెప్పుకోండి చూద్దాం." అంది ధైర్యం చేసి.

"అబ్బ. నాకు తెలీదు. నువ్వు చెప్పు". మళ్ళా పుస్తకంలోని పేజీలు తిప్పడం మొదలెట్టాడు.

"ఆ పుస్తకం ఒక్క అయిదు నిముషాలు అవతలపెట్ట కూడదా! 24 గంటలూ పుస్తకాలు పట్టుక్కూర్చుంటే ఎలా అవుతుంది? ఆఫీసు నించి వచ్చేక ఒక అరగంట యినా కబుర్లు చెప్పాలని... అస్సలు... మీకుండదా?"

భాస్కరం నవ్వేసేడు.

"ఎప్పుడూ వుండేవేగా కబుర్లు! కొత్తవి ఎక్కడ్నుంచి పుట్టుకొస్తాయి? పుస్తకాలు చదివితే లోకజ్ఞానం వస్తుంది. కొత్తకొత్త విషయాలు తెలుస్తాయి!

"సరే! చదవండి. వద్దని నేనెందుకంటాను. కాని; దానికి వేళాపాళా వుంటుంది. ఎప్పుడు పడితే అప్పుడు..."

"అయితే ఎప్పుడు పుస్తకం చదవమంటావు చెప్పు? పొద్దున్న పట్టుకుంటే 'యిప్పుడా? తర్వాత చదువుదురుగాని. కాస్సేపు కబుర్లు చెప్పండి' అంటావు. పగలంతా ఆఫీసు! సాయంత్రం పట్టుకుంటే యిలా అంటావు. రాత్రి అయితే నిద్రపట్టదని లైటార్పేస్తావు. మరెప్పుడు చదివేది?" విసుక్కున్నాడు పుస్తకం పక్కనపడేసి.

ఇన్నిమాటలు... ఇన్నిమాటలు అతని నోటివెంట వస్తున్నాయి. కాని సినిమా విషయం రావడంలేదు. అదే తన బాధ. ఎందుకిలా జరుగుతోంది! అంత త్వరగా మర్చిపోతారా పొద్దున్న యిద్దరం కల్సి అంతలా ప్రోగ్రాం వేసుకున్నాం కదా!...

"ఆయన ఆ విషయం ఎత్తరు. తనే ఎత్తాలి." అనుకుంది.

"ఏమండీ, సినిమా కెళ్దాం అన్నారు!?"

"నేనన్నానా, నువ్వన్నావా?"

"పోనీ ఎవరో ఒకరు అన్నాం. కాని యిద్దరం కల్సి వెళ్దాం అనుకున్నాం కదా."

"వర్షం..."

"బాగుందండీ. వర్షం ఎప్పుడో తగ్గిపోయింది."

"రోడ్లు ఎంత బురదగా వున్నాయో నీకు తెలుసా? ఒకసారి వీధిలోకెళ్తే తెలుస్తుంది. అనవసరంగా ఒక మంచి చీర బురదపాలవుతుంది"

"రిక్షాలో వెళ్దాం."

"అబ్బ. ఇవాళ్టికి నన్నొదిలెయ్యి సుజీ. మధ్యాహ్నమంతా చచ్చీ-చెడీ లెక్కలన్నీ చూసినా బుక్సు టాలీకాలేదు. సాయంత్రం వెళ్ళాలి. ఆ పని చెయ్యకపోతే వర్క్ అలా పెండింగులో వుండిపోతుంది.

తల తిరిగిపోయింది. సుజాతకి. అయిపోయింది. అందమైన వూహలన్నీ చెదిరిపోయేయి. ఛీ... ఛీ... ఈ సాయంకాలాన్ని ఎంత అందంగా వూహించుకుంది తను! అతని నడుంచుట్టూ చేయివేసి స్కూటరుమీద గాల్లో తేలిపోతున్నట్టుగా సినిమాకి వెళ్తున్నట్టు వూహించిందే! ఛ.. తన జాతక మేమిటోగాని తనేది అనుకుంటే అది అవదు. ఎంత చిన్నకోర్కెనైనా సరే తను కోరితే మాత్రం తీరదు. మనసుని నులిపేస్తున్నట్టు ఆలోచనలు!

"సుజీ! కోపం వచ్చిందా, నామీద సినిమాకి రానన్నానని! ఏం చెయ్యను చెప్పు? నీకు చెప్పేనుకదా పెండింగు వర్క్ బోలెడు వుండిపోయిందని. అదంతా పూర్తిచేసి స్టేట్‌మెంట్లు పంపిస్తే కదా క్లోజింగ్ అలవెన్సు దొరికేది. దాంతో దేవిగారికి మాంచి చీర... ఇవాళ్టికి నన్నొదిలేయ్. ఈసారెప్పుడైనా నీకోరిక తీరుస్తాగా..."

బలవంతంగా పెదవులమీదకి నవ్వుని తెచ్చుకుంది ఆమె. "నాకోరికను అతను తీరుస్తా నంటారు. అంటే అతనికి.. కోరికగా వుండదా... నాతో రావడం కేవలం నాకోరిక తీర్చడానికే. అంటే, తనకి ఇష్టం లేకపోయినా తప్పనిసరిగా ఆయన వస్తారన్నమాట!" మనసుని ఎంత సరిపుచ్చుకుందా మన్నా అలాంటి ఆలోచనలేవస్తున్నాయి సుజాతకి.

భాస్కరం బట్టలేసుకుని వెళ్ళిపోతుంటే అలా చూస్తుండిపోయింది. ఆయన అబద్ధం ఆడరు. ఆ నమ్మకం తనకి బాగా వుంది. సిగరెట్లు తాగరు. ఆఖరికి వక్కపొడికూడా వేసుకోరు. ఎప్పుడూ ఆఫీసు... పని... పని... ఆఫీసు... లేకపోతే యింట్లోనే వుంటారు. ఇంట్లో ఉన్నంతసేపు తనుచేసే ప్రతీపనిలోనూ సాయం చేస్తూ ఉంటారు. దుబారాగా ఏదీ ఖర్చుచెయ్యరు. సినిమాకూడా దుబారా కిందే లెక్క, అతని దృష్టిలో. కాని తనకి సరదా! మరి తన సరదా తీరేదెలాగ?

భాస్కరం వెళ్తున్నవైపే చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయింది సుజాత. నీరజ పిలుపుతో తేరుకుంది.

"సుజాతా, నేను వెళ్తున్నానే; సినిమాకి. నువ్వు రాననేసేవు మరి. మీ ఆయనతో వెళ్తానన్నావు. వెళ్ళలేదేం?"

"అదేమిటే! ఒకర్తివే వెళ్తున్నావు? మీ ఆయన రారా?"

"ఆయన ఎప్పుడొచ్చేరు కనుక. నేనెక్కడికి వెళ్ళినా ఆయన యింట్లో వుంటారులే. నేనొక్కర్తినే అంటావా! హాలు కెళ్తే అక్కడ నాలాంటివాళ్ళు ఎవరైనా కనబడకపోరులే. నీ సంగతేమిటి..... సినిమా ప్రోగ్రాం అన్నావు!"

"లేదు. డిసెంబరు నెలకదా. ఆఫీసుకు ఏన్యువల్ క్లోజింగ్ వర్క్ ఉంది. అందుకే రావడానికి అవదు. నాకు మరి వెళ్ళడానికి మూడ్ పోయింది"

"పోనీ నాతో రాకూడదూ?"

"వద్దులేవే - నువ్వెళ్లు."

వెళ్ళిపోతున్న నీరజవైపే చూస్తూండిపోయింది సుజాత. అందంగా ముస్తాబయివుంది, నీరజ. ఆమె అందాన్ని వర్ణించాలంటే తనకున్న భాషా జ్ఞానం సరిపోదు. గులాబీరంగు చీర ఆమెతెల్లని వంటికి బాగా నప్పింది. పెదాలకి చిన్నగా లిప్‌స్టిక్ టచ్‌చేసింది. చెవులకి రింగులు, కాళ్ళకి ఎత్తుజోళ్ళు. సూది ముక్కు, చిలిపి కళ్ళు బూరెబుగ్గలు, తెల్లని మెడ, ఒంటిపేట వరుస ముత్యాలహారం ఆర్టిఫిషియల్‌దైనా అందంగా మెరిసిపోతున్నాది. ఒకచేతికి వాచీ, మరొక చేతికి కడియంలాంటి గాజు. అంతా మెరుపే, ఆకర్షణే.

అలా నీరజ ఒక్కర్తీ ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళిపోవడం సుజాతకి నచ్చదు.

"అంతలా ముస్తాబు చేసుకుని అదెలా వెళ్ళిపోతుందో బాబూ! ఆడవాళ్ళు ఒక్కళ్ళూ వెళ్ళేరంటే రోడ్డుమీద, సినిమా హాల్లోనూ, ఎవరో ఒకరు ఏదో కామెంటు విసుర్తారు. వాట్ని తట్టుకోవడం చాలా కష్టం. నీరజా తనూ క్లాస్‌మేట్స్. ఈ మధ్యనే వాళ్ళాయనకి ఈ వూరు బదిలీ అయింది. ఇల్లు కావాలని అంటే పక్కవాటా ఖాళీగా వుందని చూపెట్టింది తను, నచ్చిందని వెంటనే దిగిపోయేరు. అది సరేగాని, ఈ నీరజేమిటి ఇలా వెళిపోతోంది! ఇంట్లో వాళ్ళాయన ఒక్కడే కాదు... వయసులో వున్న పనిమనిషికూడా వుంది... వాళ్ళిద్దర్నీ అలా వదిలేసి నీరజ వెళ్లడం సుజాతకి ఏమీ నచ్చలేదు.

నీరజ ఇంట్లో పనిమనిషి పేరు గౌరి. వంటపని దగ్గర్నుంచి అన్నిపన్లూ దానివే. పొద్దున్న వచ్చి రాత్రి పదిదాకా వుంటుంది. నీరజ మనస్తత్వం అర్థంకావడంలేదు సుజాతకి... ఎంతో సంతోషంగా కనబడుతుంది, ఎప్పుడూ నవ్వుతూ - నవ్విస్తూ చాలా సరదాగా వుంటుంది, నీరజ.

మనసులో ఎలాంటి కల్మషం లేనట్టుగా అనిపిస్తుంది. ఏ విషయాన్నీ పెద్దగా పట్టించుకోదు హఠాత్తుగా ఓ రోజు జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది.....

తనూ నీరజా కల్సి సినిమాకి వెళ్ళేరు. తను పిరికిది, భయస్తురాలు. పైగా ఇద్దరే. హాలులో నంబర్లు చూసుకొని కూర్చున్నారు. కొంతసేపయ్యేక సుజాత పక్కసీటులో ఒకతను వచ్చి కూర్చున్నాడు. సుజాతకి వంట్లోంచి వణుకు పుట్టడం మొదలెట్టింది. అతని శరీరం తనకి తగులుతుందేమోననే భయంతో ఆమె నీరజమీదకి వంగి ఒదిగిఒదిగి కూర్చుంది. ఒకవేళ అతను తన కాలుని తొక్కితే..... భుజంమీద చేయివేస్తే, తొడమీద గిల్లితే..... అమ్మో..... ఏం చెయ్యడం? ఆమె కేమీపాలుపోలేదు. నానా అవస్థలు పడిపోతోంది. ఇదంతా గమనించిన నీరజ నెమ్మదిగా సుజాత చెవిలో అంది.....

"సుజా! ఇంతలో నా శీలం ఏమీ పోదుగాని, నేను అతనిపక్క కూర్చుంటాను. నువ్వు నా జాగాలో కూర్చుని నీ శీలాన్ని జాగ్రత్తగా కాపాడుకో."

నీరజ లేచి సుజాత సీటులో కూర్చుంది. నీరజ వ్యంగ్యంగా అందో, సరదాగా అందో సుజాతకి అర్థం కాలేదు. అసలు నీరజ మనస్తత్వమేమిటో ఆమెకి బొత్తిగా అర్థం కాలేదు. ప్రపంచంలోని సంతోషమంతా దానిదే అన్నట్టు వుంటుంది. నీరజ భర్తకూడా దాన్నేమీ అనడేమో. అతగాడెప్పుడూ యింట్లోనే వున్నట్టుంటాడు. ఒకవేళ వెళ్ళినా రాత్రిపూట ఏ క్లబ్‌కో ఎక్కడికో వెళ్ళి చాలారాత్రి తిరిగివస్తాడు.

నీరజ యింట్లో వున్నప్పుడు అతను వుండడు. నీరజ ఎక్కడికైనా వెళితేమాత్రం అతను యింట్లోనే వుంటాడు. పాపం నీరజకి సినిమాల పిచ్చిఉంది కాని చాలా మంచి స్వభావం దానిది. ఎవరేమన్నా పట్టించుకోదు. హోటళ్ళకి, సినిమాలకి, బట్టలషాపులకి - వెళ్తూనే వుంటుంది. వాళ్ళిద్దరి మధ్యా అరుచుకోవడాలు లేవు. అల్లకల్లోలాలు లేవు. అయిష్టతలు అసలే లేవు. వాళ్ళిద్దరూ తనకి ఒక అర్థంకాని ప్రశ్నగా తయారయ్యేరు.

సుజాత స్వతహాగా కొంచెం ఎక్కువ ఆలోచిస్తుంది. ఇప్పుడు నీరజ, ఆమె భర్త వచ్చిన దగ్గర్నుంచి ఆలోచనలు మరీ ఎక్కువైపోయేయి. వాళ్ళిద్దరూ ఒక నిశ్శబ్ద సంగీతంగా కనిపిస్తున్నారు. కాని భాస్కరం! ఆయినకైతే... చీర దగ్గర్నుంచికూరదాకా అంతా అతనిష్టప్రకారమే జరిగితీరాలి! లేకపోతే రాద్ధాంతం చేస్తారు. తనుమాత్రం అన్నింటికీ వాదిస్తుంది. ఇద్దరిమధ్యా వాదప్రతివాదనలు చాలా జోరుగా సాగుతాయి. ఉరుము, మెరుపులు, గాలి, తర్వాత వర్షం రూపం దాలుస్తుంది. సుజాత భర్తమాటలకు వుడుక్కుని కోపం తెచ్చుకుని, ఆఖరికి ఏడ్చేస్తుంది. తర్వాత ఆమెని వూరుకోబెట్టే సర్కి భాస్కరంకి తాతలు దిగొస్తారు...!

నీరజ సినిమాకెళ్ళిపోయింది. తనొక్కర్తి యింట్లో వుంది. సుజాతకేమీ తోచడం లేదు. తగ్గిపోయిందనుకున్న వర్షం మళ్ళీ మొదలెట్టింది. నీరజ లేనప్పుడు పక్కవాటావైపు ఎప్పుడూ వెళ్ళదు సుజాత. కాని అటునుంచి నెమ్మదిగా మాటలు వినిపించేయి సుజాతకి ఎందుకో అనుమానం వేసింది. అప్రయత్నంగా ఆమె పాదాలు పక్కవాటా వైపు నడిచేయి. నవ్వులు కూడా వినబడుతున్నాయి. ఎవరివి?...

ఒకటి గౌరి నవ్వు!

రెండవది.....నీరజ భర్త మోహన్‌ది!

గౌరి యింకా నవ్వుతూనే ఉంది.

"వదలండి బాబూ! నీరజమ్మ వచ్చేసిందంటే ఏమనుకుంటారు?"

వెంటనే మోహన్ నవ్వు వినిపించింది. "నీరజ ఇప్పుడప్పుడే ఎలా వస్తుందే. సినిమా అంతా అవాలి. దానికి చాలా టైముందికాని...."

గుండెలదురు తున్నా చూడకూడదనుకుంటూనే సుజాత కిటికీ తలుపుకున్న కన్నంలోంచి చూసింది. ఆ దృశ్యం చూడగానే ఒళ్లంతటా కంపరం కలిగింది.

మోహన్ అసలు స్వరూపం యిదా?!

నీరజకి తెలిస్తే ఏమవుతుంది?

అదో పిచ్చిమొద్దు. అసలు దానికి అలాంటి అనుమానాలే రావుకాబోలు! తను చెప్పేస్తే!? ఏమని చెప్తుంది? ఒకవేళ చెప్పినా అది నమ్ముతుందో, లేదో?

"నువ్వు ప్రతీదీ భూతద్దంలోంచి చూసినట్టు చూస్తావు సుజాతా! ఆ రోజు సినిమాలో నీశీలం పోయినట్టు కొట్టుకుపోయేవు అతగాడి పక్కన కూర్చోవడానికి! గౌరితో సరదాగా, నవ్వుతూ మాట్లాడినంత మాత్రాన చెడిపోయినట్లేనా? డోంట్ బి సిల్లీ! నా భర్త సంగతి నాకు తెలుసా -

నీకు తెలుసా? ఆయన అలాంటివారు కాదు'' అని నీరజ అనేస్తే! తన మాటకి విలువపోతుంది. సుజాత తనలో తనే కొట్టుకుపోతోంది ఆ విషయం గురించి. నీరజకి చెప్పటమా, మానటమా అని తటపటాయిస్తూ వుంటేనే రెండురోజులు గడిచిపోయేయి.

ఆ రోజు నీరజ హడావుడిగా పరుగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమిటమ్మా అంత హడావుడి! ఏం జరిగిందేమిటి?'' అదోలా చూస్తూ అంది సుజాత.

"మా అమ్మ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. నాన్నగారికి ఈ మధ్య వంట్లో బాగుండడంలేదట. నన్ను చూడాలని వుందని అంటున్నారట. అందుకని వెళ్ళి ఓ వారం రోజులుండి వచ్చేద్దామని...''

"ఎప్పుడెళ్తున్నావు?''

"ఇవాళే-మధ్యాహ్నం రైల్లో''

"మీ ఆయన వస్తున్నారా నీవెంట?''

"లేదే. ఆయనకి శలవు దొరకడం కష్టంట.''

"అదేమిటి! మోహన్‌కి శలవుల్లేకపోవడమేమిటి? మొన్నామధ్య మోహన్, ఆయనతో అంటున్నప్పుడు తను వింది "మోహన్‌కి శలవులు ఎన్నో వున్నాయని'' మనసులోనే ఆశ్చర్యపోయింది సుజాత.

అమాంతం దాన్నిపట్టుకుని, "నీరజా! నువ్వు ఎంతమాత్రం వూరికి వెళ్ళడానికి వీల్లేదు. నువ్వసలు ఎక్కడికీ వెళ్ళకు. మీ ఆయన ఎక్కడుంటే అక్కడేవుండు. ప్లీజ్'' అని గట్టిగా చెప్పాలనిపించింది. కాని అదేమనుకుంటుందో?

సుజాత ఆ విషయం ఎత్తకుండా వూరుకుంది.

★ ★ ★

నీరజ వెళ్ళిపోయిన దగ్గర్నుంచి సుజాత మనసంతా అటేవుంది. ఏ పనిచేస్తున్నా ఒకటే ఆలోచన వస్తున్నది. ఈ టైంలో మోహన్ ఏంచేస్తూంటాడు?'' వాళ్ళ సంగతి మనకెందుకు?'' అని వూరుకుందామంటే మనసు వూరుకోవడం లేదు. భర్తతో అన్నాళ్ళయి కాపురం చేస్తున్న నీరజకి ఏమాత్రం అనుమానం కలగలేదంటే ఆశ్చర్యంగా వుంది! అది అంత నిశ్చింతగా, సంతోషంగా ఎలా వుండగలుగుతోంది?

గౌరి వచ్చింది.

"అమ్మా! ఆ బాబు పత్రికుంటే ఇమ్మన్నారు. చదివిచ్చేస్తారట'' అంది.

గౌరివైపు తేరపార చూసింది సుజాత. నల్లగా నిగనిగలాడే శరీరం, అవయవాల పొంకం; ఆకర్షణ ఎక్కువే. మొహం మాత్రం డోకువచ్చేటట్టు వుంటుంది. ఎత్తుపళ్ళు, చీపికళ్ళు, చప్పిముక్కు... ఈ గౌరిలో ఏ అందాలు చూసి మోహన్ నీరజని మోసం చేస్తున్నాడో బోధపడ్డం లేదు. నీరజ ముందు యిది సూర్యుడి ముందు దివిటీలా వుంటుంది. అతను దీని మోజులో పడ్డాడేమిటి, అసహ్యంగా!... ఛీ... కొంతమంది మగాళ్ళకి పెళ్లాం ఎంత అందంగా వున్నాసరే పర స్త్రీమీద

మోజు వుంటుందేమో. అయినా దీనికి బుద్ధి వుండక్కర్లేదూ. ఒక్క లెంపకాయ యివ్వాలనిపించింది దాన్నిచూస్తూ. కాని పుస్తకం యిచ్చి పంపేసింది.

భాస్కరం ఆఫీసుకెళ్ళిపోయేక సుజాత వంటింటిపని పూర్తిచేసుకుని వచ్చి గదిలో మంచంమీద పడుకుని వీక్లీ తిరగేస్తున్నాది.

తలుపుమీద టకటకమని చేతివేళ్ళతో కొడ్తున్న చప్పుడు వినిపించి లేచి తలుపు తీసింది సుజాత.

ఎదురుగా మోహన్ నిలబడివున్నాడు నవ్వుతూ. తను యిచ్చిన పుస్తకం అతని చేతిలో వుంది.

సుజాతకి కాళ్ళు వణుకుతున్నాయి. గుండెదడదడలాడుతున్నాది. ఏం మాట్లాడా లన్నా ఆ రోజు కిటికీ... కన్నం... నుంచి... తను చూసిన దృశ్యమే... కళ్ళముందు కదలాడు తున్నాది. భయంతో ఆమెకు ముచ్చెమటలు పోస్తున్నాయి.

“ఏమిటి అలా వణికిపోతున్నారు? నేను మీకు రాక్షసుడిలా కనబడుతున్నానా ఏమిటి కొంపదీసి! కనీసం కూర్చోమనైనా అనకుండా అలా నిలబెట్టేసేరు” నవ్వుతూ అంటూనే లోపలికి వచ్చేడు.

ఎలాగో గొంతు పెగల్చుకుని “కూర్చోండి” అంది.

“లేదండి. వూరికే అన్నాను. మీ పుస్తకం తీసుకోండి. చాలా థాంక్స్. వస్తాను” అదోలా చూసి నవ్వుతూ అన్నాడు.

మోహన్ వెళ్ళిపోయేక సుజాత పుస్తకం తెరచి చూసింది. ఏ వ్యక్తిమీదైనా ‘అనుమానం’ అన్నది రాకేపోవాలిగాని వస్తేమటుకు ఆ వ్యక్తి చేసే ఎంత చిన్నపనైనా, ఏ పనైనా అనుమానాస్పదంగా కనబడుతుంది.

పుస్తకం మధ్యలోంచి చిన్నకాగితం జారి కిందపడింది.

“పెద్ద మనిషి దొరికపోయేడు అడ్డంగా” అనుకుంది.

కాగితం మడతపెట్టి వుంది. విప్పింది.

★ ★ ★

సుజాతా!

నిన్ను ఏకవచనంతో సంబోధిస్తున్నానని ఏమీ అనుకోకు. ఎందుకంటే అందమైన ప్రతీ ఆడదీ నాకెంతో ఆత్మీయురాలిలాగే కనబడుతుంది. నీ అందం, నీముఖంలో కనబడుతున్న అమాయకత్వం, నీ బెదురు చూపులు, రెపరెపలాడే కనులు నన్ను వెర్రెక్కిస్తున్నాయి. పిచ్చివాడ్ని చేస్తున్నాయి. నేను నీకోసం ఎంత పరితపించిపోతున్నానో నీకు తెలీదు. నీరజ గురించి భయం నీకేం అక్కర్లేదు. అదో పిచ్చిది. దాని మనస్తత్వమే వేరు. దాని విషయం నేను చూసుకుంటాను. నువ్వు ఒక్కసారి... మా ఇంటికి... నా గదిలోకి... నా హృదయంలోకి రా... ప్లీజ్ రావూ? నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను. నీ అందం నన్ను సాహసం చెయ్యమని పురికొల్పింది. నాకు మనసులో వున్నది ఫ్రాంక్‌గా చెప్పెయ్యటం అలవాటు. కడుపుకి ఆకలివేస్తే అన్నం తింటున్నాం. అలాగే యిది

శరీరానికి ఆకలి... నరాలకి ఆకలి! అంతే! అర్థం అయిందనుకుంటాను! నువ్వు మహాపిరికిదానివని... నీ భర్తకి యీ వుత్తరం చూపించే సాహసం నీకు లేదని నాకు తెల్సు. ఆ ధైర్యంతోనే వ్రాస్తున్నాను. ఒకవేళ చూపించినా నాకేం నష్టంలేదు. నేను రకరకాలుగా నా హేండ్ రైటింగుని మార్చగలను. అసలు ఈ ఉత్తరం చూస్తే నేనే వ్రాసేనని చెప్పినా ఎవరూ ఛస్తే నమ్మరు. అందుకే అన్ని విధాలా నాతో సహకరించడమే నీకు మంచిది - మోహన్."

ఉత్తరమంతా చదివిన సుజాతకి అసహ్యంవేసింది. పట్టరానికోపంతో పళ్ళు పటపటా కొరికింది. అరచేతుల్లో చెమట్లుపట్టేసేయి. శరీరం వణకడం మొదలెట్టింది. ఆ వుత్తరాన్ని చిన్నచిన్న ముక్కలుచేసి కిటికీలోంచి అవతలకు విసిరేద్దామని అనుకుంది. కాని వెంటనే ఏదో స్ఫురణకు వచ్చినదాన్లా ఆ కాగితాన్ని మడతపెట్టి చీరలమధ్య దాచేసింది. విషయమంతా పూసగుచ్చినట్లు భర్తకు చెప్పేయాలనుకుంది. తను ఆయనకి చెప్పేస్తే యిహ ఆ మోహన్‌కి గట్టిగానే బుద్ధిచెప్తారు. కాని ఎందుకో విషయం ఆయనదాకా తీసుకెళ్ళడం అంతగానచ్చలేదు ఆమెకి! ఈ సమస్యని తనే స్వయంగా పరిష్కరించాలి! ఛీ. ఇలాంటి మగాళ్ళని అస్సలు ఏం చెయ్యాలి? వీళ్ళకి ఎప్పటికి బుద్ధివస్తుంది? అంత అందమైన భార్యని పెట్టుకుని అతనికి ఇదేం బుద్ధి! నీరజ... పాపం నీరజని తల్చుకుంటే జాలివేస్తోంది. దానికి ఏగొడవా తెలీదు. అది వున్నప్పుడు దానివెనుక తిరుగుతూ మహాబుద్ధిమంతుడిలా, అపర శ్రీరామచంద్రుడిలా పోజుకొడ్తాడు మోహన్! పాపం అది అమాయకురాలు. తన భర్త నిజంగా శ్రీరామచంద్రుడిలాంటి వాడే అనుకుంటోంది కాబోలు. దానికి "నిజం" తెలియాలి. ఎలాగైనా చాపక్రింద నీరులా వుండి యిన్ని నాటకాలు ఆడుతున్న ఆ అపర శ్రీరామచంద్రుడ్ని తన భార్యచేతే రెడ్‌హేండెడ్‌గా పట్టించెయ్యాలి! ఎలాగ? ఎలాగ? తీవ్రంగా ఆలోచించసాగింది సుజాత. ఉన్నట్టుండి ఒక చక్కటి ఆలోచన... ఫ్లాష్‌లా వెలిగింది ఆమె మస్తిష్కంలో.

వెంటనే ఒక తెల్లకాగితం మీద పెన్‌తో చకచకా ఉత్తరం వ్రాసింది. కవరుమీద నీరజపేరువ్రాసి కేరాఫ్ అడ్రసువాళ్ళ నాన్నగారిది వ్రాసి కవర్ని తనే స్వయంగా వెళ్ళి పోస్టుచేసి వచ్చింది. ఉత్తరం అంటే పోస్టు చేసేసిందికాని ఆమె గుండెలు దడదడలాడు తున్నాయి. నరనరాల్లో ఏదో తెలీని భయం! నీరజకి ఉత్తరం వ్రాయడం పూర్తయింది. కాని అంతకంటే ముఖ్యమైన పని మరొకటి మిగిలిపోయింది. అది ఎంతో సాహసంతో చెయ్యవలసిన పని! తనకి సాహసం లేదా! ధైర్యంలేదా! తను ఒక్కర్తే ఎంతధైర్యంగా ఈ సమస్యని పరిష్కరిస్తుందో మోహన్ స్వయంగా చూసి తెల్సుకుంటాడు! తెల్సుకుని కళ్ళు తేలవేస్తాడు! అప్పుడు అనుభవంలోకి వస్తుంది అతగాడికి సుజాత అంటే ఏమిటో! అతనెలా పైకి మర్యాదస్తునిలా కనబడుతూ, లోతున చాపక్రింద నీరు మాదిరి ప్రవర్తిస్తున్నాడో, తనుకూడా అలాగే; చాపక్రింద నీరులాగే, భర్తకీ, ఎవరికీ తెలియకుండా, తనే స్వయంగా అతనిపని పట్టాలి!

మళ్ళీ పెన్ చేతిలోకి తీసుకుని చిన్నకాగితం, మీద యిలా రాసింది.

"ఇవాళ బుధవారం..... ఆదివారం రాత్రి... మీ దగ్గరకు వస్తాను. అందాకా ఓపిక పట్టండి."

సంబోధన, సంతకంలేని ఆ నాలుగు ముక్కలు వ్రాస్తుంటే ఆమె చేతివేళ్ళు వణికేయి. ఆ

కాగితాన్ని చిన్నగా మడతపెట్టి ఒక పుస్తకంలో పెట్టింది. పుస్తకాన్ని చేత్తోపట్టుకుని పక్కవాటావైపు నడిచింది. తలుపు నెమ్మదిగా తీసుకుని లోపలికి అడుగుపెట్టింది. మోహన్, పైన వరండామీద గోడకున్న అద్దంలో చూసుకుంటూ తల దువ్వుకుంటు న్నాడు. అతనికి వినపడేలా గౌరిని పిల్చి పుస్తకం దానిచేతికిచ్చేసి అతని కిచ్చేమని చెప్పి, వచ్చినంత వేగంగా తిరిగి తన వాటాలోకి వెళ్ళిపోయింది. ఆ మాత్రం సాహసం చేసేటప్పటికీ ఆమెకు ముచ్చెమటలు పోసేయి. అసలు సాహసకార్యం యింకా ముందుంది. దానికిది నాందీ ప్రస్తావన మాత్రమే. ఏం జరుగుతుందో? అభాసుపాలు కాదుకదా! ఇదంతా తన భర్తకి తెల్సిపోయిందంటే తలవాచేలా చీవాట్లు పెడతారు. ఎదుటి మనిషిని అర్థంచేసుకునే సహృదయత్వం ఆయనకి వున్నా ప్రథమకోపం కూడా ఉంది. "ఇలాంటి విషయాల్లో ఎందుకు తలదూరుస్తావు. కొరివితో తల గోక్కున్నట్టు అవుతుంది!" అని తిడితే!? అందుకే సాధ్యమయినంతవరకు యిదంతా ఎవ్వరికీ తెలియకుండా జరిగిపోవాలి. ఆ మోహన్ బండారం బయటపెట్టాలి. నీరజ కళ్ళతో తను స్వయంగా చూసి ఆశ్చర్యపోయి అసహ్యించుకోవాలి! లేకపోతే కళ్ళతో చూసేది 'నిజం' చెవుల్తో వినేది 'అబద్ధం' అనుకుంటుంది పిచ్చిపిల్ల! ఇలాంటి కీచకుల్ని తనలాగ అందరూ చాకచక్యంగా ఎదుర్కొంటే సమాజంలో ఇన్ని అత్యాచారాలే జరగవు ఆడదానిమీద. ఆడది ఎప్పటికప్పుడు యిలాంటి కీచకుల బారినుండి తప్పించుకుందికి చాలా మెలుకువగా వుండాలి. ఆలోచనలు ధైర్యాన్నిస్తున్నా గుండెలు పీచుపీచు మంటున్నాయి!

★ ★ ★

అనుకున్న ఆదివారం వచ్చేసింది. భాస్కరం సంవత్సరాంతపు పని ఎక్కువగా వుండడం వల్ల ఆదివారం కూడా ఆఫీసుకి వెళ్ళేడు. "రాత్రి ఆఫీసులో డిన్నరుంది. ఆలస్యంగా వస్తా"నని... చెప్పేడు.

మోహన్‌కి గాల్లో తేలిపోతున్నట్టుగా వుంది. "ఎంతో ముభావంగా, ఏమీ ఎఱగ నట్టుండే సుజాత... యింత సులభంగా వప్పుకుంటుందని తను కలలోకూడా అనుకోలేదు. అమ్మో! ఆడవాళ్ళు పైకి అలా అమాయకంగా కనిపిస్తారు. కాని అసాధ్యులు. అయినా వాళ్ళకి మాత్రం కోరికలుండవా? మార్పో కొత్తరుచో కావాలని అనిపించదా? నిజమే" యిలా అనుకుంటూంటే మోహన్‌కి కాళ్ళు నేలమీద నిలవడం లేదు. ఆ రోజు గౌరిని యింటికి పంపించేసేడు. రాత్రి గ్యాస్ స్టౌమీద వేణ్ణీళ్ళు పెట్టుకుని స్నానం చేసేడు. వళ్ళంతా పౌడరు దట్టంగా పట్టించి తెల్లటి గ్లాస్కోపంచె, లాల్చీ వేసుకుని, సెంట్ స్ప్రే చేసుకున్నాడు. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుని తెగ మురిసిపోయేడు. వీధి తలుపులు తీసివుంచేడు. గది తలుపులు బార్లా తీసిపెట్టేడు. గదిలో ప్రతివస్తువు శ్రద్ధగా సర్ది వుంచేడు. సాయంత్రం కొన్న పువ్వులు పరుపుమీద జల్లేడు. సువాసనలు వెదజల్లుతున్న పుష్పగుచ్ఛాన్ని ఒక దాన్ని చేత్తో పట్టుకుని దానిని ఆఘ్రాణిస్తూ కాస్సేపు అటూఇటూ పచార్లు చేసేడు. నిముషనిముషానికీ సహనం తగ్గిపోతున్నాది. ఆత్రుత పెరిగి పోతున్నాది. సుజాత యింకా రాదేం! ఎందుకింత ఆలస్యం!! సుజాత భర్త యింట్లో లేడు. మరి తను రావడానికి యింత ఆలస్యం చేస్తోందేమిటి! అనుకొంటూ అద్దం దగ్గరికి వెళ్ళి మరోసారి తన ముఖం చూసుకున్నాడు. జుత్తు మరోసారి దువ్వుకున్నాడు. పరుపుమీద తలగడకి ఆనుకుని పడుకుని పుస్తకం తిరగేస్తున్నాడు. ఏమాత్రం చిన్నశబ్దం అయినా సుజాత వస్తున్నదేమోనని తలవెనక్కి

తిప్పి గుమ్మంవైపు చూడ్డం, ఎవరూ లేకపోయేసర్కి నిరాశ చెందటం... అతనికి విసుగ్గా వుంది.

ఇంతలో హఠాత్తుగా లైట్లారిపోయాయి. లైట్లారిపోవడం, గుమ్మం దగ్గర ఎవరో నెమ్మదిగా వస్తున్నట్టు అడుగుల చప్పుడు ఒక్కసారే అయేయి. సుజాత... సుజాత వస్తోంది. అడుగులో అడుగు వేసుకుంటూ..... హంస గమనలా... కిన్నెరసానిలా... వెన్నెల రాణిలా... సుతిమెత్తని అడుగులతో తనగదిని తనమదిని పావనం చెయ్యడానికి వస్తోంది...!

మోహన్ మరి నిగ్రహించుకోలేకపోయాడు. దిగ్గున లేచి ఆ చీకట్లోనే ఆమెని గాఢంగా కౌగిలించుకున్నాడు.

"సుజాతా! మైడియర్ సుజాతా! నన్ను కరుణించేవా యిన్నాళ్ళకి! నీరజకి నువ్వేం భయపడకు. అది ఒక శుద్ధమొద్దావతారం! నేను గౌరితో సంబంధం పెట్టుకున్నప్పుడే యింట్లో ఉండికూడా అది పోల్చలేకపోయింది... అలాంటిది అదిప్పుడు ఊర్లో లేదు. చచ్చినా పోల్చలేదు. అసలు అనుమానం అన్నదే రాదు. దటీజ్ మై లక్! ఐ యామ్ రియల్లీ వెరీ లక్కీమాన్. మాట్లాడవేం సుజాతా! నేను నీకోసం ఎంత పరితపించి పోతున్నానో తెలుసా. అయామ్ రియల్లీ డైయింగ్ ఫర్ యు!...."

ఆమె బుగ్గలమీద అతని పెదవులకి తడిగా తగిలింది!

ఆమె వెచ్చని కన్నీరు వుప్పగా!

"ఏమిటి సుజాతా! ఏడుస్తున్నావా?!...

హఠాత్తుగా లైట్లు వెలిగాయి.

షాక్ తిన్నవాడిలా సడన్‌గా ఆమెని వదిలిపెట్టేడు మోహన్. ఆమె సుజాత కాదు.

నీరజ! అతని భార్య. సాక్షాత్తూ నీరజ!

తలవంచుకుని మౌనంగా రోదిస్తోంది.!

ఆశ్చర్యంతో, అవమానంతో మనసు బరువెక్కుతుంటే మోహన్ తప్పు చేసిన వాడిలా తలవంచుకున్నాడు.

గుమ్మం దగ్గర అడుగుల సవ్వడి వినిపించింది.

చటుక్కున తలెత్తి చూసేడు ఆశ్చర్యంగా.

అక్కడ సుజాత నిలబడి వుంది! "నా ప్రియమైన నేస్తం నీరజకి. నువ్వు కులాసా అనుకుంటాను. మీ వారికి ఒంట్లో బాగులేదు, హాస్పిటల్లో ఎడ్మిట్ చేసేం. నువ్వు వెంటనే బయలుదేరిరా, నీకీ ఉత్తరం శనివారం అందుతుది. ఆదివారం రాత్రికి ఇంటికి చేరుకో. ఆదివారం సాయంకాలం మీ ఆయన్ని ఆస్పత్రి వారు డిశ్చార్జి చేస్తారుట. అంత వరకు బెంగలేదు." - ఇది, సుజాత నీరజకి రాసిన ఉత్తరం. అన్నీ సరిగా ప్రోగ్రాం వేసినట్టు జరిగేయి. తను మొదలెట్టిన ఈ సాహసకార్యం యింత విజయవంతంగా ముగిసినందుకు ఆమె చూపులో కించిత్ గర్వం తొంగిచూసింది.

★ ★ ★

***(కలువబాల, 16-30 జూన్ 1988)***